# 'ఆర్బ!'

— వడ్డమన్నాటి కుటుంబరావు




పిసినారి పరమేశం, లోభి లోకేశం ఒకే ఆఫీసులో పనిచేస్తుంటారు. ఒకరోజు సాయంత్రం ఆరున్నర గంట అవుతుండగా హడావుడిగా థియేటర్ కిన్నెర దగ్గర కొచ్చాడు పరమేశం. అదే సమయంలో ఆదరాబాదరాగా థియేటర్ కేసి వస్తున్న లోకేశాన్ని చూశాడు పరమేశం. 'వీడిక్కడ తగలడ్డాడేమిటి?' అనుకున్నాడు విసుగ్గా. లోకేశం కూడా పరమేశాన్ని చూసి లోలోపల తిట్టు [illegible] "హలో" అన్నాడు.

"హలో" అని బదులిచ్చాడు పరమేశం.

"సినిమాకేనా?" అన్నాడు లోకేశం.

"కాదు. ఒక ఫ్రెండ్ వస్తానంటే ఎదురు చూస్తున్నాను. ఇద్దరం కలిసి విజయవాడ వెళ్ళాలి. అతను రాలేదు కాబట్టి ఇక వెళ్ళిపోదామనుకుంటున్నాను" అన్నాడు పరమేశం.

"మా బాబాయి ఇక్కడికి వస్తానన్నాడు. ఇద్దరం కలిసి డాక్టర్‌గారి దగ్గరకెళ్ళాలి. ఏడీ రాలేదుగా! ఇక నేను కూడా వెళ్ళిపోతాను" అన్నాడు లోకేశం.

ఇద్దరూ 'బై' చెప్పుకుని చెరో దారినా వెళ్ళిపోయారు.

కిన్నెరలో మొదటాట మొదలైంది. ఇంటర్‌వల్ టైంలో ఒకరినొకరు పక్క పక్క సీట్లలో చూసుకున్న పరమేశం... లోకేశం... కంగుతిన్నారు!

"ఇంటికి వెడతానన్నావుగా ?" అన్నాడు లోకేశం వెటకారంగా.

"డాక్టర్‌గారి దగ్గరకి వెళ్ళడానికి మీ బాబాయి రాలేదు గాబట్టి నువ్వూ అదే పని చేస్తానన్నావుగా?" అన్నాడు పరమేశం ఎకసక్కెంగా.

బయటికెడితే పక్కవాడి టీ ఖర్చు ఎక్కడ తన మీద పడుతుందోనని కిక్కురుమనకుండా కూర్చున్నారిద్దరూ.

అయిదు నిమిషాల్లో హాలు చాలా వరకు ఖాళీ అయిపోయింది. కొద్దిమంది ఆడవాళ్ళు మాత్రమే కూర్చుని వున్నారు.

"హలో!" అన్న తియ్యటి కంఠం వినిపించి ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూసి... ఉలిక్కిపడి చేతులు జోడించి నమస్కారం చేశారు.

తనూ ప్రతినమస్కారం చేస్తూ "నో ఫార్మాలిటీస్... అవన్నీ ఆఫీసులో" అందామె. ఆమె చండ శాసనురాలైన లేడీ ఆఫీసు మేనేజర్!

"అలా లౌంజ్‌లో కెడదాం రండి" అని లేచి దారి తీసిందామె.

బిక్కమొహాలతో ఇద్దరూ అనుసరించారు.

"ఏం తీసుకుంటారు?" అంది స్టాల్ దగ్గరకెళ్ళిన తరువాత.

ఏం మాట్లాడలేకపోయారు పరమేశం, లోకేశంలు.

"ఇదేమిటయ్యా? మీరు అంత సిగ్గు పడితే ఎలా? ఇది ఆఫీసు కాదు" అంటూ మూడు జీడిపప్పు పాకెట్లు తీసుకుని తను ఒకటి వుంచుకుని మిగతావి ఇద్దరికీ చెరొకటీ ఇచ్చింది. తింటం పూర్తయినతరవాత మూడు థమ్సప్‌లు ఆర్డరిచ్చి తను ఒకటి తాగుతూ ఇద్దరినీ చెరొకటి తీసుకోమంది.

తాగడం పూర్తయ్యాక ఆమె హేండ్‌బాగ్‌లోంచి పర్సు తియ్యబోయింది.

"మేడమ్! మేం ఇస్తాం లెండి" అన్నారు పరమేశం, లోకేశాలు... లోలోపల కుమిలిపోతూ... పైకి మాత్రం చిరునవ్వు ముఖంతో...మొహమాటానికి.

"నాన్సెన్స్! నా సంగతి తెలుసుగా?" అంది కళ్ళెర్ర జేస్తూ.

పైకి భయం నటిస్తూ ఈసారి మిత్రులిద్దరూ లోలోపల మహదానందపడిపోయారు... బేవార్సుగా లభించిన జీడిపప్పు ఫ్రై... థమ్సప్‌ని తలుచుకుంటూ.

మరుక్షణంలో "డామిట్" అందామె.

"ఏమిటి మేడమ్?" అన్నారిద్దరూ కంగారుగా.

"హడావుడిలో పర్సు బాగ్‌లో వేసుకురావడం మరిచిపోయానయ్యా. మీరిద్దరూ చెరిసగం వేసుకుని పే చేసి రేపు ఆఫీసులో నాదగ్గర తీసుకోండి— మరిచిపోకుండా" ఆజ్ఞాపించినట్టుగా అని చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోయిందామె.

పర్సుతీసుకురాకుండా సినిమా టిక్కెట్టెలా తీసుకున్నావని అడిగే దమ్ము లేదు ఆ ఇద్దరికీ.

"లోభికి ఖర్చెక్కువ అంటారిందుకే గాబోలు" అనుకుని బిల్లు పే చేసి గొల్లుమన్నారు పరమేశం, లోకేశం.